క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించండి

కందనూలు: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండో, నాలుగొవ, ఆరో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లించాలని అంబేడ్కర్ సార్వత్రిక స్టడీ సెంటర్ సమన్వయ కర్త యం.అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని, జూన్ 20వ తేదీ నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. వివరాలకు సెల్: 7382929779 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ బదిలీ

పెద్దకొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న జీకే మోహన్ గురువారం వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎం.శ్రీనివాసులు తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపడుతారని అధికారులు తెలిపారు.

వైభవంగా సామూహిక హోమాలు



తాడూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి జలాధివాస, ప్రాప్తకాల పూజ, మహాస్నాపనం, మూల మంత్ర అవాహనం, సామూహిక హోమాలు చేశారు. కార్యక్రమంలో గంగాపురం పవన్‌కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి

బల్మూర్: మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదిరే జంగయ్య(67) గురువారం మృతి చెందాడు. రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందతూ కన్నుమూశాడని కుటుంబసభ్యులు తెలిపారు. జంగయ్య 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. అతని భార్య అనుసూయమ్మ ఎంపీపీగా, సర్పంచ్‌గా సేవలు అందించారు.

ఫార్మర్ రిజిస్టర్ తప్పనిసరి



చారకొండ: కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధికోసం ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టర్ నమోదును తప్పనిసరి చేసుకోవాలని ఏఈఓ అనూష అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాయిపల్లిలో ఏఈఓ రైతుల వివరాల నమోదును చేపట్టారు. రైతులు ఆధార్ నంబర్, ఫోన్ వచ్చే ఓటీపీ తెలపాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

అకాల వర్షాలకు తడిసిన వరిధాన్యం



కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకొచ్చారు. వర్షం కురవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. కొందరు రైతులు ప్రైవేట్‌లో కవర్లు తీసుకొచ్చి ధాన్యంపై కప్పి ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి జూపల్లికి వినతి

కొల్లాపూర్ రూరల్: పశువర్ధక శాఖ ఉప కేంద్రాలలో 1992 నుంచి తాత్కాలిక అటెండర్‌గా పనిచేస్తున్న మండలంలోని ఎన్మన్ బెట్ల గ్రామానికి చెందిన ఉప్పరి వెంకటస్వామి గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. తన సర్వీసును క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందించి జిల్లా పశువర్ధక శాఖ అధికారికి ఫోన్ చేసి అటెండర్ వెంకటస్వామి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

హనుమాన్ ఆలయాలు కిటకిట



కొల్లాపూర్‌లో హనుమాన్ జయంతిలో పాల్గొన్న భజరంగ్‌దళ్ నాయకులు

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో ఉన్న అభయ అరణ్య వీరంజనేయ స్వామి ఆలయంలో గురువారం భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజ, సింధుర అభిషేకం, అన్న ప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ పట్టణ సంయోజక్ పులి భరత్, శివకృష్ణ, మహేష్, రవి, రఘు, శివ, అశోక్, చిన్న, చరణ్, సాయిరాం, సన్నీ ఉన్నారు.

భక్తులకు అన్నదానం

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, పెంట్లవెల్లి, జటప్రోల్, గోపులాపుర, మల్లేశ్వరం గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంచాలకట్ట, పెంట్లవెల్లి ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. అర్చకులు శివయ్యశర్మ, ప్రవీన్, లోకేశ్వరయ్య, కాంగ్రెస్ నాయకురాలు గాదెల సుధారాణి పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

దోమలపెంట: ఈగలపెంటలోని శివాలయం, వీరాంజనేయ దేవస్థానములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోమలపెంట ఆలయంలో జై హనుమాన్ నామస్మరణ మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ఎదుట ఉన్న హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెంకటరమణ, సత్యనారాయణ, నరేష్, రమేష్, శ్రీనివాసులు, సంబు శోభ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

లింగాల: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని అంబట్‌పల్లి, కోమటికుంట, శాయిన్‌పేట, అప్పాయపల్లి, సూరాపూర్, వల్లభాపూర్ తదితర గ్రామాలలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులు ఆలయాలను సందర్శించి పూజలు జరిపారు. ఆలయాలను ముస్తాబు చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గురువారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు.



కల్వకుర్తిలో..



ఈగలపెంటలో అన్నదానం చేస్తున్న ఎస్ఈ రవీంద్రకుమార్, ఈఈ రమేష్



మన్ననూరులో..

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ సందీప్‌కుమార్

తాడూరు: మండల కేంద్రంలో సింగిల్ విండోలో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ సందీప్‌కుమార్, చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు విత్తనాలు అందజేశారు. గుంతకోడూరు, యాదిరెడ్డిపల్లి, పొల్మూరు, గుట్టలపల్లి, ఆకునెల్లికుదురు గ్రామాల రైతులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని ఐతోలు ఆగ్రో సేవా కేంద్రంలో 100 బ్యాగుల జీలుగ విత్తనాలు, జనుము బ్యాగులు 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఐతోలు ఉన్న విత్తనాలు సిర్సవాడ, పాపగల్, బలాన్‌పల్లి, గోవిందాయపల్లి, ఇంద్రకల్, యాత్నతాపూర్ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 కిలోల విత్తనాలు రూ.2137లు, 40 కిలోల విత్తనాలు రూ.2510లు ఉంటుందని పేర్కొన్నారు. కావల్సిన రైతులు ఆయా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మన్ననూర్: విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం విజయ్‌మోహన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని బడి బయట ఉంటున్న, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు చక్కటి బోధన ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఎల్లయ్య, లాల్‌సింగ్, శివలింగం, రజిత, దేవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిద్దాం



జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా గురువారం సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

■ భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను సాధిద్దామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. షెడ్యూల్ కులాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని కొనియాడారు. హరికథలు, సాహిత్యం, ఉపన్యాసాల ద్వారా దళితులను చైతన్యం చేశారన్నారు. అదేవిధంగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ టీపీ భరత్, ఏఓ కృష్ణయ్య, ఏఎస్‌డబ్ల్యూ శ్రీకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ ఐడియాలజి మిషన్ ఆధ్వర్యంలో మాదిరి భాగ్యరెడ్డి వర్మ జయంతిని నిర్వహించారు. 1910 కాలంలో స్థాపించిన మూల భారతీయుల విద్యాప్రదాత, దళిత ఆత్మగౌరవపతాక, గొప్ప సాంఘిక సంస్కర్త అని పలువురు వక్తలు తెలిపారు. మద్దిలేటి, కృష్ణయ్య, బాలరాజు, తిరుపతయ్య, ఆనంద్, సురేందర్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

■ కొల్లాపూర్‌లో భాగ్యరెడ్డి వర్మ 137 వ జయంతి వేడుకలను ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కలమంద శేఖర్, నాయకులు కురుమయ్య, సందీప్‌కుమార్, సురేందర్ ఉన్నారు.



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ఈగలపెంటలో..

■ తాడూరులో దళిత మేధావి భాగ్యరెడ్డివర్మ 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు విజయ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

■ ఈగలపెంటలోని భూగర్భ కేంద్రం సీఈ పరిపాలన కేంద్రం శక్తి సదన్ వద్ద భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు నివాళులర్పించారు. ఎస్ఈ(ఓఅండ్ఎం)ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్)రవీంద్రకుమార్ హాజరయ్యారు. ఈఈ రమేష్, డీఈ శ్రీధర్, మురళీధర్, (హెచ్ఆర్) కిరణ్‌కుమార్‌రాయి, అకౌంటెంట్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

తెలకపల్లి: మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదంలో గురువారం ఐదుగురికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన వెంకటేష్, రామచారి యవకులు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు కాలు విరగగా, రామచారి గాయాలయ్యాయి. రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కాటన్ మిల్లు వద్ద కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మన్ననూరు వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. గ్రామ సమీపంలో కాటన్‌మిల్లు వద్ద అదుపు తప్పి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిట్టెమ్మ, చెన్నయ్య గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యారు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విత్తన నమూనాల సేకరణ



బిజినేపల్లి: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల వద్ద బీటీ విత్తన నమూనాలను గురువారం మండల వ్యవసాయ అధికారులు సేకరించారు. మండల కేంద్రానికి చెందిన యంగ్ ఫార్మర్స్, గౌతమి ట్రేడర్స్, శ్రీసాయి ట్రేడర్స్ నుంచి 8 విత్తన నమూనాలు సేకరించినట్లు ఏఓ నీతి తెలిపారు. విత్తనాలను టెస్టింగ్ ల్యాబోరేటరీకి పంపిస్తామని పేర్కొన్నారు.

దేశం కోసం ఏకమవుదాం



కొల్లాపూర్: కుల, మతాలకు అతీతంగా దేశం కోసం అందరం ఐక్యంగా ఉందామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. గురువారం సాయంత్రం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీ కొనసాగింది. జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. పహల్గాం ఘటన తర్వాత దేశ రక్షణ కోసం భారత సైన్యం పోరాడిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, సందు రమేష్, కడ్తాల కృష్ణ, కేతూరి నారాయణ, సాయికృష్ణగౌడ్, భరత్‌చంద్ర, ధనుంజయ్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, కురుమయ్య, శ్రీరాంయాదవ్, పరమేష్, పురేందర్, శివకృష్ణ, భాస్కర్ ఉన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని కొట్రలో బొడ్రాయి ప్రతిష్ఠించి మూడేళ్లు కావడంతో గురువారం గ్రామస్తులు నీటితో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి సహకరించాలని భక్తులు కోరారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, అశ్విని కాంతారావు, మాజీ ఎంపీటీసీ రాములు, వెంకటేశ్వరరావు, భూపతిరావు ఉన్నారు.

విద్యార్థుల్లో భాషా ప్రావీణ్యం పెంచాలి



డీఈఓ రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొల్లాపూర్: విద్యార్థుల్లో భాషా ప్రావీణ్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తెలుగుతోపాటు ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా విద్యాబోధన చేపట్టాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. సులభతరమైన విధానాలతో బోధన చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం డీఈఓను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ ఇమ్మానుయేల్‌తోపాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రిసోర్స్ పర్సన్ నెహ్రూప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల వేసవి శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ జీవన్ కుమార్, గోపాల్, శ్రీలక్ష్మి, గోవర్ధన్, చెన్నకేశవులు, ఇబ్రహీం, విజయ్, పద్మ, విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

తిమ్మాజిపేట: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని శాస్త్రవేత్తలు డాక్టర్ శశిభూషణ్, ప్లాంట్ బ్రీడింగ్, రమేష్ పేర్కొన్నారు. మండలంలోని మారేపల్లి గ్రామంలోని రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగులో అనుసరించే నూతన యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సాగునీటిని ఆదా చేసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ సుధాకర్, పూర్ణచందర్‌రెడ్డి, ఏఈఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



వెల్దండ: మండలంలోని కొట్రలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి గురువారం కల్వకుర్తి ఏడీ శంకరయ్య, వెల్దండ ఇన్‌చార్జ్ ఏఈ జానకిరామ్‌లు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలకు గ్రామంలోని స్థలాన్ని పరిశీలించామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. త్వరలోనే పూర్తి నివేదికలను సిద్ధం చేసి ఉన్నత అధికారులకు అందజేస్తామని వివరించారు. నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, రవీందర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు, సిబ్బంది లష్కర్, లైన్‌మెన్ యాదయ్య, జూనియర్ లైన్‌మెన్ బంగారి తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ను కించపర్చడం సరికాదు

మన్ననూర్: సార్లపల్లి మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ కించపర్చే విధంగా మాట్లాడటం సరికాదని ఆదివాసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు అన్నారు. మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. చెంచులను విమర్శించడం తగదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెంచులకు ఏమి చేయలేదని కాంగ్రెస్ నాయకులు అనడంలో అర్థం లేదన్నారు. 2023 జూన్ 30వ తేదీన 483 మంది చెంచు రైతులకు పోడు భూముల పట్టాలు ఇవ్వడంతో పాటూ రైతు బంధు కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. మన్ననూర్ గ్రామంలో రూ: 1.15 కోట్లతో గిరిజన భవనం నిర్మించి చెంచుల ఉనికిని కాపాడారన్నారు. చెంచు పెంట అయిన అప్పాపూర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయితీగా గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, రాఘవేంధర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కోడేరు: మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులను మోసం చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లు చేరే వరకు రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కుప్పలుగా ఉన్నా కాంటా వేయడం లేదని, దీంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, మేడిమాకుల శేఖర్, అశోక్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



తెలకపల్లి: పచ్చిరొట్టతో భూసారం పెంపొందుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీరాం, రాజారెడ్డి, ఏఓ నర్మద అన్నారు. గురువారం మండలంలోని లక్నారంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పొలాల్లో రసాయనిక ఎరువులకు బదులు పచ్చిరొట్టతోనే నేల సారవంతం అవుతుందని దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నేలకు స్వభావం ఆధారంగా పంటమార్పిడి చేసుకోవాన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. రసాయనిక ఎరువులకు బదులుగా జీగురులను వాడాలని కోరారు. పాలెం వ్యవసాయ విద్యార్థులు మట్టి నమునాల విధానాలను గూర్చి వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావ్య, సింగిల్ విండో డైరెక్టర్ రాజా మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బాలస్వామి కొన్ని నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కూతురు జ్యోతి వివాహానికి కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గురువారం వివాహం సందర్భంగా వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు రూ.30 వేల విలువ గల పట్టువస్త్రాలు, బీరువా అందజేశారు. దోడ్లపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ యాపర్ల మాధవ రెడ్డి రూ. 5 వేల నగదును అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్, మాద్గుల బాలస్వామి, పుల్లయ్య, సిరాజ్, వెంకటయ్య, నిరంజన్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

తిమ్మాజిపేట: ఆధ్యాత్మికచింతనతో ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు భూమానందగౌడ్‌స్వామి అన్నారు. తిరుమల తిరుపతి హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహాభారతంపై భూమనందగౌడ్, భగవద్గీతపై శ్రీశైలం, రామాయణం చరిత్రపై రాధాకృష్ణ భక్తులకు వివరించారు. నాగేశ్వర్, శేఖర్, ఆంజనేయులు, ఉసెనయ్య, వెంకట్రాములు, నాగరాజు, గోపాల్, తిరుపతయ్య, మన్నెమయ్య, వెంకటయ్య పలువురు భక్తులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



కల్వకుర్తి రూరల్: ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ కోరారు. గురువారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు 210 దినాలు, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, బాలస్వామి, భాస్కర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. సీఐటీయూ నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పొదిలి రామయ్య మాట్లాడుతూ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శివ, నాగమణి, ఎల్లమ్మ, శ్రీదేవి, అలివేల, రేణుక, నాగయ్య, వెంకటేష్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులు